క్లుప్తంగా

అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఎస్ఓ

ఉదయగిరి: అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అటవీశాఖ కృష్ణంపల్లి ఎఫ్ఎస్ఓ షేక్ మునీర్ అన్నారు. ఆయన శుక్రవారం తన సిబ్బందితో కలిసి మండలంలోని ఆర్లపడియ, కృష్ణంపల్లె గ్రామాల్లో అడవుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేసవి దృష్ట్యా ఆకతాయిలు అడవులకు నిప్పు పెడితే అటవీ సంపద జంతు సంపద అంతరిస్తుందన్నారు. అటవీ ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతున్నా.. అడవి జంతువులు తాగునీటి కోసం గ్రామాల్లోకి వచ్చినా సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీట్ అధికారులు అఫజల్, కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

రూ.1.48 లక్షల నగదు పట్టివేత



స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న ఎస్సై నాగార్జునరెడ్డి

సంగం: ఎన్నికల తనిఖీల్లో భాగంగా ఏర్పాటు చేసిన సంగం చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీల్లో ఎటువంటి పత్రాలు లేకుండా కారులో తరలిస్తున్న రూ.1.48 లక్షల నగదు పట్టుకున్నారు. నెల్లూరు నుండి విరువూరు వైపు వెళ్తున్న కారును ఎస్సై నాగార్జునరెడ్డి తనిఖీ చేసి నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఎస్సై మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రజలు రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లకూడదని, అంతకు మించి నగదు తరలిస్తే సరైన పత్రాలు చూపించాలన్నారు.

భద్రాద్రికి గోటితో వలిచిన తలంబ్రాలు



కలిగిరిలో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కలిగిరి: కలిగిరిలో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులు గోటితో వలచిన తలంబ్రాలను శుక్రవారం భద్రాద్రికి తరలించారు. కలిగిరమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఊరేగింపుగా వెంకటేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం ప్రత్యేక వాహనంలో భద్రాదికి తరలించారు.

కాటంరెడ్డిని కలిసిన మేకపాటి



విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసిన రాజగోపాల్‌రెడ్డి

అల్లూరు: ఇటీవల వైఎస్సార్‌సీపీలో చేరిన కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డిని ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో శుక్రవారం కలిశారు. మేకపాటి మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గం జలదంకి మండలంలో విష్ణువర్ధన్‌రెడ్డి అనుచరులు ఉన్నారని విష్ణువర్ధన్ రెడ్డి వారి అనుచరులను కూడా తనకు అండగా నిలిచి గెలిపించాలని కోరడం జరిగిందన్నారు. 19న విష్ణువర్ధన్‌రెడ్డి తన నియోజకవర్గంలో ప్రచారం చేస్తారని తెలియజేశారన్నారు.

నామినేషన్లకు పగడ్బందీ చర్యలు

- ఆర్వో రాజారమేష్ ప్రేమ్‌కుమార్



పోలీసులతో మాట్లాడుతున్న ఆర్వో

ఉదయగిరి: ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు ఉదయగిరి అసెంబ్లీ స్థానానికి సంబంధించి నామినేషన్లు స్వీకరణకు సంబంధించి ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో పటిష్ట మైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉదయగిరి ఆర్వో రాజరమేష్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో పోలీసు అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నామినేషన్ కేంద్రం సమీప ప్రాంతంలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.

కావలి అభివృద్ధి బాధ్యత మా నలుగురిదే

- ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయం
- ఎన్నికల తర్వాత ఊపందుకోనున్న పట్టణ ప్రగతి
- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



పట్టణంలో ఐదు వార్డుల కూడలి పోలేరమ్మ గుడి వద్ద ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి గజమాలతో తమ అభిమానం చూపుతున్న ప్రజలు

కావలి : కావలి నియోజకవర్గ అభివృద్ధికి నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా విజయం సాధించనున్న వేణుంబాక విజయసాయిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, అల్లూరు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, మీ ఆశీర్వాదంతో మరోసారి ఎమ్మెల్యే కానున్న తాను కలిసి నలుగురం నాలుగు స్తంభాల్లా నిలబడుతామని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావుతో కలిసి పట్టణంలోని పాతూరులో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే పుట్టి పెరిగిన పాతూరులో ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన లభించింది. స్థానికులు క్రేన్‌లతో గజమాలలు, జేసీబీలతో పూలవర్షం కురిపిస్తూ స్వాగతించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మే 13న జరగనున్న ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ ఎన్నికలు కావలి ప్రగతికి కూడా కీలకంగా మారనున్నాయన్నారు. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె హార్బర్‌తో పాటు అనుబంధ పరిశ్రమలు, పారిశ్రామిక కారిడార్, దామవరం విమానాశ్రయ నిర్మాణంతో ఎన్నికల తర్వాత నియోజకవర్గ ప్రగతి కొత్త పుంతలు తొక్కనుందని తెలిపారు. పట్టణ ప్రగతి కూడా ఊపందుకోనుందని వివరించారు. తనపై నమ్మకంతో రెండు సార్లు గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని తెలిపారు. మూడో సారి కూడా అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు ప్రజలంతా అండగా నిలబడినందుకు చాలా గర్వంగా, సంతోషంగా ఉందన్నారు. ఈ దఫా 45 వేల పైచిలుకు మెజార్టీతో కావలి నియోజకవర్గ గెలుపును జగనన్నకు కానుకగా అందిద్దామని పిలుపునిచ్చారు.

ప్రజలను దోచుకోవడమే ప్రతిపక్షాల అజెండా

ప్రతిపక్షాలకు ప్రజల బాగోగులు అవసరం లేదు, సామాజిక, మౌలిక అభివృద్ధితో పని లేదు. కేవలం దోచుకోవడమే అజెండాగా పెట్టుకున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. కోవిడ్ సమయంలో అడ్రస్ లేని ప్రతిపక్షాలు ఎన్నికల టైంలో ఏ మొహం పెట్టుకుని ప్రజల ముందుకు రాగలుగుతున్నారని ప్రశ్నించారు. కరోనా సమయంలో వలంటీర్లు ప్రాణాలకు తెగించి సేవలందిస్తే చివరకు వలంటీర్ వ్యవస్థపై కూడా పగబట్టి ప్రజలకు దూరం చేశారని మండి పడ్డారు. రౌడీయిజంతో, డబ్బుతో ఎన్నికల్లో గెలవలేరని, ప్రజాభిమానం మాత్రమే గెలుపును నిర్దేశిస్తుందని హితవు పలికారు.

అడుగడుగున హారతులతో స్వాగతం పలికిన మహిళలు

ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పట్టణంలోని పాతూరులో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి వేలాదిగా తరలివచ్చిన ప్రజలు, క్రేన్‌లు, జేసీబీల సాయంతో పూలవర్షం కురిపిస్తూ అభిమానాన్ని చాటుకున్నారు. మహిళలు అడుగడుగునా మంగళహారతులతో ఆశీర్వదించారు. గుమ్మడికాయలతో దిష్టితీస్తూ నిండు మనస్సుతో దీవించారు. కావలి చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో, ఇప్పటి వరకూ ఏ నాయకుడికి లభించని రీతిలో స్థానికులు ప్రతాప్‌కుమార్‌రెడ్డికి ఘన స్వాగతం పలకడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

జనం మద్దతు జగన్ ప్రభుత్వానికే

- మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి



బ్రాహ్మణపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

మర్రిపాడు: రాష్ట్రంలో సంక్షేమ పాలన అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే ప్రజల మద్దతు ఉందని, ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేసి ఫలాలను ప్రజలకు అందించిన వైఎస్ జగన్నే మళ్లీ సీఎంగా చూడాలని కోరుకుంటున్నారని నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బ్రాహ్మణపల్లి బీసీ కాలనీలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలతో మమేకమయ్యారు. తమ కుటుంబం ఇదే ప్రాంతంలో ఉంటూ అభివృద్ధికి సహకారం అందించిన విషయాలను గుర్తు చేశారు. స్థానికులను పేరు పేరున పలకరిస్తూ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నుంచి నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా ఎంపీ విజయసాయిరెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యేగా తన కుమారుడు మేకపాటి విక్రమ్‌రెడ్డి పోటీ చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ సంక్షేమాన్ని అందించిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఎన్నికల సమయంలో చుట్టపు చూపుగా వచ్చే వాళ్లందరూ ఇప్పుడు కలిసికట్టుగా వస్తున్నారని, అలాంటి వారిని నమ్మితే ప్రజలకు కష్టాలు తప్పవన్నారు. దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డిని రెండు సార్లు ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదిస్తే ఆయన అభివృద్ధి చేసేందుకు మార్గం వేశారని, ఆయన స్థానంలో వచ్చిన మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆ మార్గంలో నడిచి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నాడని పేర్కొన్నారు. నియోజకవర్గంలో విద్యాభివృద్ధి కోసం తమ కుటుంబం రూ.కోట్లాది అందజేసిందని, ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి సైతం ఆత్మకూరు డెవలప్ మెంట్ ఫోరం పేరుతో అభివృద్ధికి శ్రీకారం చుట్టారన్నారు. అభివృద్ధిని చేతల్లో చేసి చూపిస్తారని, రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సింగారెడ్డి చిన సుబ్బారెడ్డి, చెన్ను వెంకటేశ్వరరెడ్డి, రాజాల జయరామిరెడ్డి, కొండారెడ్డి, లక్ష్మీరెడ్డి, దుగ్గిరెడ్డి కృష్ణప్రసాద్‌రెడ్డి, వెంకటరెడ్డి, చెన్ను రఘునాథరెడ్డి, మానం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం

- అల్లూరు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి



ప్రచారంలో విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, సుకుమార్‌రెడ్డి తదితరులు

కావలి: రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర సమగ్రాభివృద్ధి, పేదల సంక్షేమం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమని అల్లూరు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. కావలి పట్టణం పాతూరులో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో విష్ణువర్ధన్ రెడ్డి శుక్రవారం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయి పదేళ్లు అవుతున్నా కేంద్రం నుంచి అనుకున్న సహకారం లభించకపోవడం, రాష్ట్రంలో నిధుల కొరత వంటి పరిస్థితుల్లోనూ ఐదేళ్ల పాటు జగన్‌మోహన్‌రెడ్డి అద్భుతమైన పాలన అందించి సమర్ధవంతమైన నాయకుడిగా పేరు తెచ్చుకున్నారని తెలిపారు. భవిష్యత్ తరాల బాగుకోసం మళ్లీ జగన్‌మోహన్ రెడ్డినే ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కావలి బరిలో ఎమ్మెల్యేగా నిలిచిన రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డిని, నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు మన్నెమాల సుకుమార్‌రెడ్డి, నాయకులు జనిగర్ల మహేంద్రయాదవ్, కాటా శ్రీనివాసులురెడ్డి, ఈతముక్కల చంద్రశేఖర్‌రెడ్డి, మండలి కృష్ణారావు, పానుగోటి అనురాధ, షేక్ షాహుల్ హమీద్, తోట హరి, ఆత్మకూరి కలగయ్య, ఎర్రయ్య పాల్గొన్నారు.

ప్యాకేజీలకు అమ్ముడుపోయి విమర్శలా?

- వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ కంటాబత్తిన



ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

సంగం: గత ఎన్నికల వరకు టీడీపీలో ఉండి.. ఎన్నికల తర్వాత వైఎస్సార్‌సీపీకి వచ్చి ఇప్పుడు నిస్సిగ్గుగా ప్యాకేజీలకు అమ్ముడుపోయి తమ పార్టీని విమర్శించడం మీ దగాకోరు రాజకీయానికి నిదర్శమని వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ కంటాబత్తిన రాఘునాథ్‌రెడ్డి దుయ్యబట్టారు. శుక్రవారం సంగంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రతిపక్ష నాయకులు తమ ఎమ్మెల్యే మేకపాటి వల్ల లబ్ధి పొంది ఎన్నో సొంత పనులు కూడా చేయించుకున్నారన్నారు. 2019 ఎన్నికల సమయంలో దివంగత మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి వెంట ఎందుకు నడవలేకపోయామంటూ మొసలి కన్నీళ్లు కార్చారని, గౌతమ్‌రెడ్డి అనంతరం విక్రమ్‌రెడ్డి సైతం మీకు సముచిత స్థానం కల్పించారన్నారు. పార్టీ మారి నీతులు మాట్లాడే మీరు 2006లో సర్పంచ్ కాక ముందు నీ పరిస్థితి ఏమిటో, ప్రస్తుతం ఏమిటో ప్రజలకు తెలుసన్నారు. 2024 ఎన్నికల్లో విక్రమ్‌రెడ్డి తప్పక విజయం సాధిస్తారన్నారు. అనంతరం మండలంలోని చెన్నవరప్పాడు, తలుపూరుపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందచేసి వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సంగమేశ్వరాలయ చైర్మన్ పెరుమాళ్ల రవీంద్రబాబు, వైఎస్సార్‌సీపీ నేతలు పావళ్ల కొండయ్య, మల్లికార్జున, తలుపూరుపాడు నాయకులు షేక్ కరిముల్లా తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే, రాజ్యసభ సభ్యుడు

కావలి: బోగోలు మండలం కోళ్లదిన్నె గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, ఆయన వర్గీయులతో కలిసి శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి స్థానిక గాయత్రీనగర్‌లో ఎన్నికల ప్రచారంలో ఉన్న రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ నాయకుడు పందిపట్ల వెంకటరమణ ఆధ్వర్యంలో దాసి ప్రసాద్, పచ్చా సోమయ్య, పందిపట్ల సుబ్బారాయుడు, జ్యోతి శ్రీనివాసులు, జ్యోతి మీరయ్య, పచ్చ నెద్ద కొండయ్య, మొగిలి శ్రీను తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. కావలి ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు.

జగనన్నకు మద్దతుగా.. మేముసైతం

- వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు

ఉదయగిరి: మండలంలోని కొండాయపాళెం గ్రామ సచివాలయ పరిధిలోని పలువురు వలంటీర్లు శుక్రవారం మూకుమ్మడి రాజీనామాలు చేశారు. సచివాలయ పరిధిలో 17 మంది గ్రామ వలంటీర్లు ఉండగా 15 మంది తమ రాజీనామా లేఖలను ఈఓపీఆర్డీ ఎస్. మల్లికార్జునకు అందజేశారు. మిగిలిన వారు కూడా మరో రెండు రోజుల్లో రాజీనామా చేయనున్నారు.

ఉదయగిరి : ప్రతిపక్ష పార్టీలు వలంటీర్లను అనుమానిస్తూ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయడాన్ని నిరసిస్తూ శుక్రవారం 21 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. దుత్తలూరు బిట్-1, బిట్-2, నందిపాడు సచివాలయాలకు సంబంధించిన వలంటీర్లు ఎంపీడీఓ సురేష్ బాబుకు రాజీనామా పత్రాలు సమర్పించారు.

వరికుంటపాడు: మండలంలోని పెద్దిరెడ్డిపల్లి, కాంచెర్వు, గువ్వాడి, విరువూరు గ్రామాలకు చెందిన 70 మంది వలంటీర్లు తమ రాజీనామాలను శుక్రవారం ఎంపీడీఓ తోట కృష్ణకుమారికి అందజేశారు. తమపై టీడీపీతో పాటు ప్రతిపక్షాలు కక్ష కట్టి వేధిస్తున్నాయని, ఇందుకు నిరసనగా రాజీనామా చేస్తున్నామన్నారు.

మర్రిపాడు: మండలంలోని అల్లంపాడు, మర్రిపాడు, చిలకపాడు, భీమవరం గ్రామాలకు చెందిన ఐదుగురు వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు.

సీతారామపురం(ఉదయగిరి): మండలంలోని బసినేని పల్లి సచివాలయానికి చెందిన 19 మంది వలంటీర్లు శుక్రవారం మూకుమ్మడిగా రాజీనామా చేసి పత్రాలు పంచాయతీ కార్యదర్శి మాల్యాద్రికి అందజేశారు. చంద్రబాబు కుట్రకు నిరసనగా రాజీనామాలు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బాబుకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

కలిగిరి: మండలంలోని కలిగిరి, కృష్ణారెడ్డిపాళెం, పోలంపాడు, చిన్నఅన్నలూరు సచివాలయాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న గ్రామ వలంటీర్లు 23 మంది శుక్రవారం స్వచ్ఛందంగా రాజీనామాలు సమర్పించారు. తమపై కొంతమంది కుట్రలు పన్ని విధులుగా దూరం చేశారన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని 11, 12 వార్డుల్లో పనిచేస్తున్న నలుగురు వలంటీర్లు శుక్రవారం స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. తమపై బురద జల్లడం జీర్ణించుకోలేక రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. తాము వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించేందుకు, తద్వారా జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి సీఎం అయ్యేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు.

సోమశిల: మండలంలోని పలు సచివాలయాల్లో పనిచేస్తున్న 37 మంది వలంటీర్లు శుక్రవారం స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. గ్రామాల్లో ఇరుగుపొరుగు వారితో మాట్లాడిన ఫొటోలు తీసి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ ఆరోపించారు. రేపటి నుంచి స్వేచ్ఛగా ప్రజలకు అండగా ఉంటామన్నారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

మర్రిపాడు: అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి 30 బాటిళ్లను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కృష్ణాపురంలో 20 మద్యం బాటిళ్లు రామానాయుడుపల్లి, 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. ఇప్పటి వరకు తనిఖీల్లో 11 కేసులు నమోదు కాగా 150 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎమ్మెల్యే ప్రచారం నేడు

బిట్రగుంట: బోగోలు మేజర్ పంచాయతీలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీర రఘు యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు బోగోలు ప్రధాన కూడలిలోని దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలతో నివాళి అర్పించిన అనంతరం ప్రచారం ప్రారంభమవుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ప్రచారంలో పాల్గొనాలని కోరారు.

సీఎం జగన్‌తోనే ప్రజల ఆర్థికాభివృద్ధి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సోమశిల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ప్రజల ఆర్థికాభివృద్ధి, జీవన స్థితుల్లో మార్పు వస్తుందని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టామని, అవన్నీ మీ కళ్ల ముందే కనిపిస్తున్నాయని, నియోజకవర్గం మరింతగా అభివృద్ధి చేసేందుకు ప్రజలంతా జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు. శుక్రవారం రాత్రి అనంతసాగరం మండలం గోవిందంపల్లి, పాతాళపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేసిన సంక్షేమాన్ని వివరించారు. భవిష్యత్‌లో మరిన్ని సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే జగనన్న లక్ష్యమన్నారు. పాతాళపల్లి పంచాయతీ పరిధిలో రూ.8.71 కోట్ల ప్రజల ఖాతాల్లో నేరుగా జమ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రూ.23 లక్షలు, జగనన్న లే అవుట్‌లో 22 మందికి ఇంటి ప్లాట్లు అందజేశామని వివరించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు మా దృష్టికి తీసుకొచ్చిన గోవిందంపల్లి కమ్యూనిటీ హాల్ నిర్మాణం, లైబ్రరీ, మిల్క్ చిల్లింగ్ సెంటర్, శ్మశాన వాటికకు ప్రహరీగోడ, సీసీ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను పూర్తి చేస్తామని వివరించారు. ప్రతి గ్రామంలో శాశ్వత ప్రభుత్వ భవనాల నిర్మాణాలను పూర్తి చేశామని, మిగిలినవి కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ పంచాయతీకి రూ.10 కోట్లు సంక్షేమాన్ని అందజేస్తే.. గతంలో టీడీపీ కేవలం రూ.40 లక్షలు మాత్రమే అందించారని వివరించారు. మీ ఓటే మీ భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని, ప్రతి ఒక్కరూ జగనన్న సారథ్యంలో నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా విజయసాయిరెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యేగా నేను పోటీ చేస్తున్నామని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, జేసీఎస్ కన్వీనర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, సీనియర్ నాయకులు ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి, అంబటి కృష్ణారెడ్డి, నాయకులు బిజివేముల పిచ్చిరెడ్డి, పాపిరెడ్డి, కేతా కొండారెడ్డి, ముత్తుకూరు చంద్రశేఖర్‌రెడ్డి, సాంబశివారెడ్డి, మండల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అమ్ముడు పోయే వారికి ప్రజలే బుద్ధి చెబుతారు



బోయలచిరివెళ్లలో ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ, జేసీఎస్ కన్వీనర్, తదితరులు

ఆత్మకూరురూరల్: ఊరు, పేరు తెలియని వారిని ఆత్మకూరు నియోజకవర్గంలో ఉన్నత పదవుల్లో నియమించిన ఘనత దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డికి దక్కుతుందని, ఆయన దయా భిక్షతో పదవులు పొందిన వారు రూ.లక్షల అమ్ముడు పోయి టీడీపీలో చేరడం చూసిన ప్రజలు యావగించుకుంటున్నారని వారికి నెల రోజుల్లోపే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని వైఎస్సార్‌సీపీ నాయకులు స్పష్టం చేశారు. మండలంలోని బోయలచిరివెళ్ల, పంచాయతీ పరిధిలో శుక్రవారం ఆత్మకూరు జెడ్పీటీసీ పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, మండల జేసీఎస్ కన్వీనర్ వల్లభనేనిరాజేంద్ర, బట్టేపాడు సొసైటీ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి ఇంటింటా తిరిగి వైఎస్సార్‌సీపీ తరఫున ఎన్నికల ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలో 99 శాతం హామీలు నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డి, నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డిలను ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఘన విజయం చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ వైస్ చైర్మన్ ప్రమీల, బోయలచిరివెళ్ల సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు సూరం జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రమణీయం సంగమేశ్వరుడి రథోత్సవం



రథంపై కొలువుదీర్చేందుకు తీసుకువస్తున్న దేవదేవేరుల ఉత్సవ విగ్రహాలు

సంగం: సంగంలో కొలువైన కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి రథత్సవం అత్యంత రమణీయంగా సాగింది. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పరిమళ పుష్పాలతో అలంకరించి రథంపై కొలువు దీర్చారు. గ్రామ పురవీధుల్లో హరహర మహాదేవ నామస్మరణ మధ్య రతోత్సవం జరిగింది. రథోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ రవినాయక్, ఎస్సై నాగార్జునరెడ్డి బందోబస్తు ఏర్పాటు చేసి దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ రథోత్సవానికి కోటు దయాకర్‌రెడ్డి, కోటు కరుణాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



సంగం: పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ, డీఎస్పీ



చేజర్ల: చెక్‌పోస్టు వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్వో, డీఎస్పీ

సంగం: సంగం జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆపోలింగ్ కేంద్రాల్లో వసతులను పరిశీలించారు. డీఎస్పీ కోటారెడ్డి మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు గట్టి చర్యలు చేపడుతున్నామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో నిఘా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో ఐదు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే డివిజన్ పరిధిలో రూ.42 లక్షలు సీజ్ చేసినట్లు తెలిపారు. వారి వెంట తహసీల్దారు రమాదేవి, సీఐ రవినాయక్, ఎస్సై నాగార్జురెడ్డి, ఎంఈఓ జానకీరాం తదితరులు ఉన్నారు.

పోలింగ్ బూత్ పరిశీలన

చేజర్ల: చేజర్ల జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆత్మకూరు ఆర్వో, ఆర్డీఓ కే మధులత, ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఒకే లొకేషన్‌లో మూడు, అంత కంటే ఎక్కువ పోలింగ్ బూత్‌లు చేజర్లలో ఉన్నాయని తెలిపారు. అక్కడ మౌలిక వసతులు, రోడ్డు మార్గాలపై ఆరా తీశారు. పోలింగ్‌కు సంబంధించి బారికేడ్లు ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గోపీకృష్ణ, ఎస్సై ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆదూరుపల్లి చెక్‌పోస్ట్ తనిఖీ

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లి చెక్ పోస్టును ఆత్మకూరు ఆర్వో కే మధులత, డీఎస్పీ కోటా రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. కలువాయి, పొదలకూరు రోడ్డు మార్గంలో చేజర్ల క్రాస్ రోడ్డు వద్ద ఈ చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. సిబ్బంది విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండి వాహనాలను క్షణ్ణంగా తనిఖీలు చేపట్టాలన్నారు. అధికారులు అక్కడ వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గోపీకృష్ణ, ఎస్ఐ ప్రభాకర్ పాల్గొన్నారు.

జగన్‌తోనే పేదలకు సంక్షేమం



లక్ష్మీపురంలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

దుత్తలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదలకు సంక్షేమం లభిస్తుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీపురంలో ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మేకపాటి కుటుంబం ప్రజాసేవకే అంకితమైందన్నారు. ఎంపీగా విజయసాయిరెడ్డిని, ఎమ్మెల్యేగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, నాయకులు చుండి చెన్నారెడ్డి, కంభం మురళీమోహన్‌రెడ్డి, కండ్లగుంట రవీంద్ర, చుండి చంద్ర, శివారెడ్డి, రామిరెడ్డి, శిముని వెంగళరెడ్డి, చుండి నాగార్జున, రంగయ్యనాయుడు, దొంతిరెడ్డి ఓబుల్‌రెడ్డి, శింగవరపు గంగాధర్, మస్తాన్, చుండి చైతన్య, గొల్లపల్లి వెంకటేశు, తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి వివాదంపై ఘర్షణ

వింజమూరు(ఉదయగిరి): ఆస్తి వివాదంలో ఘర్షణ జరిగి ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన వింజమూరు పంచాయతీ కోకావారిపాళెంలో శుక్రవారం రెండు దాయాది కుటుంబాల మధ్య జరిగింది. గ్రామానికి చెందిన పల్లపు అంకయ్య తల్లి లక్ష్మమ్మ పేరు మీద 1.40 ఎకరాల పొలం ఉంది. ఈ పొలంలోకి వెళ్లకుండా పల్లపు రామయ్య అడ్డుకుంటుండడంతో ఇంతకు ముందు అనేక సార్లు గొడవలు జరిగాయి. ఈ నేపథ్యంలో పల్లపు అంకయ్య బైక్‌పై వింజమూరు వెళుతుండగా పల్లపు రామయ్య, విష్ణు ఆయన్ను ఆపి గొడవ పడ్డారు. అంకయ్యపై దాడి చేయడంతో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై కోటిరెడ్డి కేసు నమోదు చేసి దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు.